Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

జాతీయ తెలుగు దినపత్రిక

APTEL/2024/86143

WANTED
స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
చిత్తూరు ఎక్స్‌ప్రెస్ దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు, జిల్లా కేంద్రాలలో స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి. అనుభవం,అర్హతను భట్టి ప్రాధాన్యత ఇవ్వబడును
సంప్రదించండి సెల్: 9440815774

ప్రచురణ : తిరుపతి | సంపుటి : 02 | సంచిక : 211 | అసోషియేట్ ఎడిటర్ : కే ఎల్ కృష్ణంరాజు | బుధవారం 12 ఆగస్టు 2026 | పేజీలు : 4 | వెల : 2

## మా డిమాండ్లలో ఎలాంటి మార్పు లేదు



- మొదటి నుంచి ఒకటే వైఖరి : ఖర్గే
- మూడు అంశాలపై విపక్షాల వైఖరి మారలేదన్న మల్లికార్జున ఖర్గే
- జంతర్ మంతర్ విద్యార్థులపై లాఠీచార్జ్, కాల్పులపై ప్రకటనకు డిమాండ్
- రామ మందిర విరాళాల దుర్వినియోగంపై సమాధానం చెప్పాలని పట్టుబాటు

## శబరిమల మహిళల ప్రవేశంపై అక్టోబర్‌లో సుప్రీం తీర్పు

- సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ హింట్
- బోధ్ గయ ఆలయ నిర్వహణ కేసు విచారణ సందర్భంగా చెప్పిన భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్
- మే 14న తీర్పును రిజర్వ్ చేసిన రాజ్యాంగ ధర్మాసనం
- ఆలయంతో సహా మతపరమైన ప్రదేశాల్లో మహిళలపై వివక్షకు సంబంధించిన పిటిషన్లపై సుప్రీంకోర్టు తన తీర్పును రిజర్వ్



### సీడ్ యాక్సెస్ రోడ్డు పనులకు

# గ్రీన్ సిగ్నల్



- పిటిషన్లు కొట్టివేసిన హైకోర్టు
- అమరావతి సీడ్ యాక్సెస్ రోడ్డు పనులకు తొలగిన అడ్డంకులు
- భూసేకరణ నోటిఫికేషన్‌ను సవాల్ చేస్తూ పిటిషన్లు దాఖలు చేసిన రైతులు
- నిబంధనల ప్రకారమే ముందుకెళ్తున్నామని వాదనలు వినిపించిన ఏజీ దమ్మాలపాటి

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

రాజధాని అమరావతి నిర్మాణంలో కీలకమైన 'సీడ్ యాక్సెస్ రోడ్డు' పనులకు ఉన్న న్యాయ పరమైన అడ్డంకులు ఎట్టకేలకు తొలగిపోయాయి. ఈ రోడ్డు నిర్మాణానికి అవసరమైన భూసేకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను ఏపీ హైకోర్టు కొట్టివేసింది. దీంతో రాజధానిలో పెండింగ్‌లో ఉన్న రహదారుల నిర్మాణ పనులకు మార్గం సుగమం అయింది. సీఆర్డీఏ పరిధిలో సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణాన్ని ప్రభుత్వం వేగవంతం చేసింది. ఇందులో భాగంగా భూమిని సేకరించేందుకు నోటిఫికేషన్ - మిగతా3లో



## చంద్రుడిపై 'మూన్ బేస్'

- ఇస్రోకు నాసా ఆహ్వానం
- భారత్, అమెరికా బాండ్ మరింత స్ట్రాంగ్!
- చంద్రుడి దక్షిణ ధ్రువం వద్ద మానవ స్థావరం ఏర్పాటుకు అమెరికా ప్రణాళిక
- ప్రతిష్ఠాత్మక మూన్ బేస్ కార్యక్రమంలో చేరాలని ఇస్రోకు నాసా ఆహ్వానం
- బెంగళూరులో భారత్–అమెరికా సివిల్ స్పేస్ జాయింట్ వర్కింగ్ గ్రూప్ సమావేశం

### ప్రతికూల పరిస్థితుల్లోనూ 10.7 శాతం సానుకూల

# ఆర్థిక వృద్ధిరేటు

- 2026 జులై నెల ఆర్థిక నివేదికను సీఎంకు అందించిన ప్రణాళిక విభాగం
- ఎల్‌నినో సంక్షోభంలోనూ ఏపీకి సానుకూల వృద్ధి ఉందని నివేదికలో వెల్లడి
- 2025-26 రెండో త్రైమాసికంలో 10.7 శాతం వృద్ధిరేటు
- ఆర్థిక వ్యవస్థ స్థిరమైన ప్రగతిని కనబరుస్తోంది



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

రాష్ట్రం ఎల్‌నినో వంటి ప్రతికూల పరిస్థితుల్లోనూ 10.7 శాతం సానుకూల ఆర్థిక వృద్ధిరేటు సాధించిందని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. భవిష్యత్తులో రాష్ట్ర వృద్ధిరేటును 15 శాతానికి తీసుకెళ్లేలా ప్రతి ప్రభుత్వ శాఖ వనరులను సమర్థవంతంగా నిర్వహిస్తూ నిర్దిష్ట లక్ష్యాలతో ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి వరకు సమాచారాన్ని సమగ్రంగా విశ్లేషిస్తూ, సామాన్యుడిపై ఎలాంటి ధరల భారం పడకుండా తగిన కార్యాచరణ చేపట్టాలని సూచించారు. జులై 2026 నెలవారీ నివేదికను ప్రణాళిక శాఖ అధికారులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు సచివాలయంలో అందచేశారు. రాష్ట్రంలో ఎల్?నినో ప్రభావంతో లోటు వర్షపాతం నమోదైనప్పటికీ స్థూల ఉత్పత్తి పడిపోకుండా అన్ని ప్రభుత్వ శాఖలు పరస్పర సమన్వయంతో పని చేయాలని సీఎం స్పష్టం చేశారు. వాణిజ్య పన్నుల శాఖ తరహాలోనే ప్రతి ప్రభుత్వ - మిగతా3లో

### 158 గ్రామాలకు తొలిసారి

# రహదారి



- చిట్టచివరి గ్రామానికి సైతం రోడ్డు సౌకర్యం
- నాణ్యతా ప్రమాణాలు పాటించాలని పవన్ ఆదేశం
- పంచాయతీరాజ్ అధికారులతో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సమీక్ష
- మరో 158 ఆవాసాలకు తొలిసారి రహదారి సౌకర్యం
- ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన కింద రూ.422.10 కోట్ల నిధులు

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

రాష్ట్రంలోని చిట్టచివరి గ్రామానికి సైతం రోడ్డు సౌకర్యం కల్పించేలా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. ఈ మేరకు గ్రామీణ రహదారుల నిర్మాణంపై పంచాయతీ రాజ్ శాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే అడవితల్లి బాట పేరిట అల్లూరి సీతారామరాజు జిల్లా, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని ఎన్నో గిరిజన గ్రామాలకు తొలిసారి రహదారి సౌకర్యం కల్పించారు. ఇప్పుడు మైదాన ప్రాంతాల్లో మారుమూల పల్లెలు, ఆవాసాలకు, కుగ్రామాలకు రోడ్లు వేసేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. 158 మారుమూల గ్రామాలకు అనుసంధాన రహదారులు నిర్మించేందుకు పరిపాలన అనుమతులిచ్చారు. 347 కిలోమీటర్ల పొడవున, 146 రోడ్లు, 19 వంతెనల నిర్మాణం - మిగతా3లో

### భారత్‌లో అరుణాచల్ అంతర్భాగం..

## మార్చడం ఎవరితరం కాదు

- ఈ వాస్తవాన్ని ఎవరూ మార్చలేరన్న విదేశాంగ శాఖ
- 27 ప్రాంతాలకు భారత పేర్లపై చైనా అభ్యంతరం
- సరిహద్దులో శాంతి అత్యంత కీలకమన్న భారత్
- ఆగస్టు 6న ఎల్ఏసీ పరిస్థితిపై చర్చలు
- దౌత్య, సైనిక మార్గాలు కొనసాగించేందుకు అంగీకారం





- విజయవాడలో దరఖాస్తుదారుల పడిగాపులు
- దేశవ్యాప్తంగా నిలిచిపోయిన పాస్‌పోర్టు సేవలు
- విజయవాడ, తిరుపతి, హైదరాబాద్ కేంద్రాల్లో తీవ్ర అంతరాయం
- స్లాట్లు బుక్ చేసుకుని వచ్చి అవస్థలు పడుతున్న దరఖాస్తుదారులు

### మొరాయించిన

# పాస్‌పోర్టు సర్వర్లు

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

దేశవ్యాప్తంగా పాస్‌పోర్టు సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. టెక్నికల్ సమస్యల కారణంగా పాస్‌పోర్టు సర్వర్లు ఒక్కసారిగా మొరాయించాయి. దీంతో ఆన్‌లైన్ సేవలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. సర్వర్ల డౌన్ ప్రభావం తెలుగు రాష్ట్రాలపై తీవ్రంగా - మిగతా3లో

### రూ.3 లక్షల విలువైన బంగారు మంగళసూత్రాన్ని

# ప్రయాణికురాలికి అప్పగించిన ఆర్పీఎఫ్



**తిరుపతి, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, ఆగస్టు 11 :** రైలులో ప్రయాణికురాలు మరిచి పోయిన రూ.3 లక్షల విలువైన బంగారు మంగళసూత్రాన్ని రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (RPF) సిబ్బంది గుర్తించి బాధితురాలికి సురక్షితంగా అప్పగించారు. దర్శి ప్రాంతానికి చెందిన ఎం.కవిత గుంటూరు–తిరుపతి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తుండగా, దీ–2 కోచ్‌లోని తన బెర్త్ వద్ద దిండు కింద 24 గ్రాముల బంగారు మంగళసూత్రాన్ని ఉంచి మరిచి పోయారు. రైలు దిగిన అనంతరం ఆభరణం కనిపించకపోవడంతో Rail Madad ద్వారా ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న వెంటనే ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఎం.సందీప్ కుమార్ పర్యవేక్షణలో సిబ్బంది రైలును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మంగళసూత్రాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వివరాలను నిర్ధారించి బాధితురాలికి ఆభరణా న్ని అప్పగించారు. ఆర్పీఎఫ్ సిబ్బంది చొరవతో విలువైన ఆభరణం తిరిగి లభించడంతో బాధితురాలు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

### కొత్తకన్నాలి బీసీ కాలనీలో

# టీడీపీ ఇంటింటి ప్రచారం

### ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించిన నాయకులు



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, శ్రీకాళహస్తి, ఆగస్టు 11**

శ్రీకాళహస్తి నియోజకవర్గం, తొట్టంబేడు మండలం శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఆదేశాల మేరకు టీడీపీ నాయకుడు రావిళ్ల మునిరాజ నాయుడు ఆధ్వర్యంలో మంగళవారం తొట్టంబేడు మండలం పెద్ద కన్నాలి పంచాయతీ పరిధిలోని కొత్త కన్నాలి బీసీ కాలనీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు ప్రతి ఇంటిని సందర్శించి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, శ్రీకాళహస్తి నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఇంటింటి ప్రచారం నిర్వహించినట్లు నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో గాలి చలపతి నాయుడు, డి. రామ నాయుడు, ప్రతాప్ రెడ్డి, డీసీసీ బ్యాంక్ చైర్మన్ భీమల బాస్కర్, కో–క్లస్టర్ వెంకటాచలం, యూనిట్ ఇన్‌చార్జీలు లెక్కల మురళి నాయుడు, జి. శంకర్ నాయుడు, ఆయకట్టు చైర్మన్ పుల్లూరు సీతారామ రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షులు దండు శంకర్ రెడ్డి, బూత్ ఇన్‌చార్జీలు వేదం వెంకటయ్య, వెంకట సుబ్బయ్య, కన్నాలి దినేష్, కనపర్తి శంకర్ నాయుడు, ఉన్నం ప్రసాద్, భాను ప్రకాష్, గురప్ప, నెలబల్లి సునీల్, కల్లిపూడి సుబ్రహ్మణ్యం, ఓబుల్ రెడ్డి, రామ్మూర్తి, సింగమాల బస్కరయ్య, చికాటి వేణు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నోటీసులు అందుకున్న ఓటర్లు విచారణకు హాజరుకావాలి

### 12 నుంచి సెప్టెంబర్ 17 వరకు శ్రీకాళహస్తిలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ విచారణ



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, శ్రీకాళహస్తి, ఆగస్టు 11**

శ్రీకాళహస్తి భారత ఎన్నికల సంఘం, తిరుపతి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఆదే శాల మేరకు చేపట్టిన ప్రత్యేక ఇంటెన్సివ్ రివి జన్ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ 2026 కార్యక్రమంలో భాగంగా శ్రీకాళహస్తి పురపాలక సంఘ కమిషనర్ కెవి కృష్ణారెడ్డి. ఈ సందర్భంగా మునిసిపల్ కమిషనర్ కెవి కృష్ణారెడ్డి మాట్లాడుతూ పరిధిలో ఓటర్లకు జారీ చేసిన నోటీ సులపై విచారణ నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ అనంతరం 5,467 మంది ఓటర్లకునో మ్యాపింగ్, 12,126 మంది ఓటర్లకు అనమలీస్ కింద నోటీసులు జారీ చేసినట్లు వెల్లడించారు. ఆయా నోటీసులను సంబంధిత ఓటర్లకు అందజేసినట్లు తెలిపారు. ఈ నోటీసులపై ఆగస్టు 12 నుంచి సెప్టెంబర్ 17వ తేదీ వరకు శ్రీకాళహస్తి పురపాలక సంఘ పరిధిలో నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం విచారణ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. విచారణ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. నోటీసులు అందుకున్న ఓటర్లు నిర్ణీత తేదీ, సమయంలో విచారణకు తప్పనిసరిగా హాజరై, ఓటరు మరియు వారి తల్లిదండ్రులకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను సంబంధిత బీఎల్ఓలకు అందజేయాలని అధికారులు సూచించారు. ఓటర్ల వివరాలను సక్రమంగా పరిశీలించి, ఎన్నికల జాబితాను పారదర్శకంగా రూపొందిం చేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

## సంవత్సరిక పీఎం కిసాన్ ఈకేవైసీ.ప్రతి రైతుకు తప్పనిసరి

**వీకోట చిత్తూరు ఎక్స్ప్రెస్ ఆగస్టు 11**

వీకోట మండల వ్యవసాయ శాఖ అధికారి అపోజి న్యూస్ టుడే తో మాట్లాడుతూ మండలంలోని రైతులకు ముఖ్యమైన సందేశాన్ని తెలియజేశారు. పీఎం కిసాన్ పథకం పొందుతున్న ప్రతి రైతు మీ మీ పంచాయతీ పరిధిలోని రైతు సేవ కేంద్రం, సిఎస్సి సెంటర్, మీసేవ కేంద్రాలను సంప్రదించి తప్పని సరిగా ఈ కేవైసీ ఆగస్టు నెలాఖరు లోపు కచ్చితంగా చేసుకోవాలని కోరినారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం పథకాలు రైతుకు రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరిగా రైతుసేవ కేంద్రాల్లో ఎన్రోల్మెంట్ చేసుకోవాలనీ రైతులను కోరినారు. అదేవిధంగా ఈ పంట స్వయంగా ఏపీ ఏఐఎంఎస్ ద్వారా రైతు స్వంతంగా బుకింగ్ చేసుకొని మామిడి సబ్సిడీ, ఉద్యాన పంటల సబ్సిడీ ఇతర పథకాలను ఈ పంట ఆధారంగా అమలు చేయడం జరుగుతుంది అని రైతులకు తెలియజేసినారు.

## ఎన్.ఎం.ఎం.ఎస్ లో సత్తా చాటిన ఆదర్శ విద్యార్థులు

**శాంతిపురం, ఆగస్టు 11 చిత్తూరు ఎక్స్ ప్రెస్**

శాంతిపురం మండలం తుమ్మిశి, ఏపీ ఆదర్శ పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయిలో నిర్వహించే ఎన్.ఎం.ఎం.ఎస్ అర్హత పరీక్షలో 14 మంది ( పి గీతిక, సి నిహారిక, ఎస్ అనూష, ఎస్ ఎల్ మాధుర్య, ఎస్ నిఖిలశ్రీ, వి నిఖిత, ఎస్ హర్షిత, ఆర్ రిషిక, ఆర్ చక్రధర్, డి దేవాన్షా, ఎమ్ మమత, బి జామిని, ఎమ్ చరణ్, ఎల్ మహిధర్ ) అర్హత సాధించారు. చిత్తూరు జిల్లా స్థాయిలో ఒక పాఠశాలలో 14 మంది ఉత్తీర్ణత సాధించిన ఘనత తమ ఏపీ ఆదర్శ పాఠశాలకు దక్కడం చాలా గర్వకారణంగా ఉందని ప్రిన్సిపల్ ఎం.డి.కే.వి. లత హర్షం వ్యక్తం చేశారు. అర్హత సాధించిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం 1000/- చొప్పున వ్యక్తిగతంగా ఉపకార వేతనాన్ని బ్యాంకు ఖాతాకు జమ చేస్తారు. విద్యార్థులను జాతీయ ఉపకార వేతన అర్హత పరీక్షకు చక్కగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయులకు మరియు ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు తెలుపుతూ పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర బృందం, పాఠశాల కమిటీ అధ్యక్షులు, ఇతర కమిటీ సభ్యులు మరియు తల్లిదండ్రులు హర్షాన్ని వ్యక్తం చేశారు.

## గ్రామాల్లో స్వర్ణాంధ్ర.. స్వచ్ఛ ఆంధ్ర..



**వీకోట చిత్తూరు ఎక్స్ప్రెస్ ఆగస్టు 11.**

కుంబాలపల్లి పంచాయతీ గెస్తంపల్లి గ్రామంలో ఈరోజు స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కు అవగాహన సదస్సు కల్పించినారు. వచ్చిన అతిధులు గ్రామస్తులతో మాట్లాడుతూ.. ప్రతి ఇంటిదగ్గర తడి చెత్త పొడి చెత్తను వేరు చేసి గ్రామపంచాయతీ చత్త బండికి అందించాలని గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే కీటకాలుకు దూరంగా ఉండవచ్చునని అంటువ్యాధులు గాని జరాలక నిరాకుండా జాగ్రత్త తీసుకోవచ్చుననీ తెలియజేసినారు. రైతులతో మాట్లాడుతూ పంట పొలాలకు సేంద్రియ ఎరువులు ఉపయోగించి తద్వారా పంటలు పండించే ఆరోగ్యవంతమైన ఆహారాన్ని తీసుకోవాలని, ప్రజలు వైపరీత్యాల పట్ల ఎప్పటికప్పుడు ప్రభుత్వ సలహాలు తీసుకొని తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

# వెండి గంట వితరణ



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు11:**

శ్రీకాళహస్తి బంజారాహిల్స్ వాస్తవ్యులు జి. హరినాథ రెడ్డి, జి. పుష్పలత కుటుంబ సభ్యులతో కలసి మంగళవారం శ్రీజ్ఞానప్రసూనాంబికా దేవి అమ్మవారికి సుమారు ఒక కిలో ఐదు వందల గ్రాముల వెండి గంటను, నాలుగు లక్షల ఇరవై తొమ్మిది వేల ఆరు వందల ఎనభై ఐదు రూపాయలు విలువతో విరాళంగా ఆలయ కార్యనిర్వహణాధికారి బి.కె.వెంకటేశులు అందజేసినారు. ఆలయ అధి కారులు, వేదపండితులు ఈ విరాళం స్వీకరించారు. దాతకు కృతజ్ఞతలు తెలియచేసి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురు దక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. అదేవిధంగా స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డి.ఈ. ఓ ఎన్.ఆర్ కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## చేపల వేలంతో ఆయకట్టు రైతులకు నష్టం

### లింగమునాయుడుపల్లి చెరువులో చేపలు వదలొద్దంటున్న రైతులు



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు11:**

శ్రీకాళహస్తి నియోజకవర్గం, తొట్టంబేడు మండలం లింగమునాయుడుపల్లి చెరువు ఆయకట్టు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చెరువులో చేపల పెంపకం, వేలం పేరుతో నీటిని సకాలంలో విడుదల చేయడం వల్ల ఆయకట్టు రైతులు పంటలు సాగు చేసుకోలేక తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లింగమునాయుడుపల్లి చెరువులో కొంత మంది చేపల వేలం నిర్వహించి చేపలను వదలడం వల్ల ఆయకట్టు రైతులకు సాగునీటి సమస్య ఏర్పడుతోందని రైతులు తెలిపారు. ఈ కారణంగా ఈ ఏడాది పూర్తిగా పంటలు వేయకుండా భూములను బీడుగా పెట్టుకోవాల్సి వచ్చిందని పేర్కొన్నారు. చెరువులో సుమారు 75 శాతం నీరు ఉన్నప్పటికీ చేపలు పట్టేందుకు నీటిని పూర్తిగా విడుదల చేస్తున్నారని, దీంతో రెండో పంటకు సాగునీరు అందక రైతులు పంటలను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలకు ఒకటి కంటే ఎక్కువ తడులు అవసరమైన సమయంలో చెరువులో నీటి నిల్వ తక్కువగా ఉండటంతో సాగునీటిని విడుదల చేయడం లేదని తెలిపారు. ఫలితంగా పంటలు ఎండిపోయి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోందన్నారు. చెరువు నీటిని పూర్తిగా విడుదల చేసిన అనంతరం రెండో తడికి నీరు అందకపోవడంతో సాగు చేసిన పంటలు దెబ్బతింటున్నాయని రైతులు వాపోయారు. చేపల కోసం నీటిని విడుదల చేయడం వల్ల తమ జీవనాధారమైన వ్యవసా యంపై తీవ్ర ప్రభావం పడుతోందని తెలిపారు. అధికారులు స్పందించి లింగమునాయుడుపల్లి చెరువులో చేపలు వదలకుండా చర్యలు తీసుకోవడంతో పాటు, ఆయకట్టు రైతులకు సాగునీరు సక్రమంగా అందేలా చూడాలని రైతులు కోరుతున్నారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తమపై దయ చూపి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని రైతుల తరఫున జి . శంకర నాయుడు ,టి.సి. మెంబర్, లింగమునాయుడుపల్లి చెరువు స్వర్ణముఖి సిస్టమ్ చైర్మన్, ఆయకట్టు రైతులు జి. బేబీ నాయుడు,నా. కుమార్,జి. రమేష్, జి. రమణయ్య, తదితర ఆయకట్టు రైతులు వారు విజ్ఞప్తి చేశారు.

## తల్లి–బిడ్డ ఎక్స్‌ప్రెస్ అంబులెన్స్ వాహనాలు ప్రారంభం

**హిందూపురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు11:**

రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేస్తూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రులకు మంజూరైన తల్లి--బిడ్డ ఎక్స్‌ప్రెస్ అంబులెన్స్ వాహనాల్లో భాగంగా జిల్లాకు ఏడు వాహనాలు మంజూరయ్యాయి. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ప్రత్యేక చొరవతో తొలి విడతగా ఐదు వాహనాలు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి అందగా, ఎమ్మెల్యే కార్యదర్శులు, నాయకులు వాటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బాలకృష్ణ ఎమ్మెల్యేగా ఎన్నికైన అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. దయాలసిస్ కేంద్రం పునరుద్ధరణ, బ్లడ్ బ్యాంకు ఆధునికీకరణతో పాటు ఇంటెన్సివ్ కేర్ యూనిట్ ఏర్పాటుకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కరోనా సమయంలో మందులు, ఎక్స్రే తదితర వైద్య పరికరాలు అందించి ప్రజలకు అండగా నిలిచారని, 'ఆరోగ్య రథం' ద్వారా వైద్య సేవలను ప్రజలకు చేరువ చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కార్యదర్శులు,టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దారిదోపిడీ దొంగలను అరెస్ట్ చేసిన పోలీసులు



**హిందూపురం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, ఆగస్టు11:**

లేపాక్షి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన దారిదోపిడీ కేసును పోలీసులు ఛేదించి ఐదుగురు నిందితులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి బాధితుడి నుంచి లాక్కెళ్లిన రూ.4,200 నగదు, మొబైల్ ఫోన్‌తో పాటు నేరానికి ఉపయోగించిన రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల మేరకు.. సిరివరం--మనేంపల్లి చెరువు మార్గంలో సిరివరం గ్రామానికి చెందిన షామీర్‌ను అడ్డగించిన నిందితులు దాడి చేసి బెదిరించి అతని వద్ద ఉన్న నగదు, మొబైల్ ఫోన్‌ను లాక్కెళ్లారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సోమవారం నిఘా ఉంచి నిందితులను అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారిలో కుళ్లన్నగారి ఆదినారాయణ (19), సింహాద్రి (19), మంజునాథ్ (21), రాజేషా (26), త్రినేష్ (21) ఉన్నారు. వీరిలో ఇద్దరు లేపాక్షి మండలానికి, ముగ్గురు కర్ణాటక రాష్ట్రానికి చెందినవారని పోలీసులు తెలిపారు. మద్యం, జల్సాలకు అలవాటుపడి డబ్బుల కోసం ఒంటరిగా వెళ్లే వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని నిందితులు దోపిడీలకు పాల్పడుతున్నట్లు దర్యాప్తులో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు హిందూపురం డీఎస్పీ కె.వి.మహేష్ పర్యవేక్షణలో హిందూపురం రూరల్ సీఐ కె.జనార్ధన్, లేపాక్షి ఎస్ఐ నరేంద్ర, సిబ్బంది దర్యాప్తు నిర్వహించారు.


## ఘనంగా జ్ఞానజ్యోతి శిక్షణ ప్రారంభం



**హిందూపురం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, ఆగస్టు 11:**

హిందూపురం మండలంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు ఎఫ్ఎల్ఎన్ (ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ) జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమం మంగళవారం లాంఛనంగా ప్రారంభమైంది. ఐసీడీఎస్ సీడీపీఓ సుధావరలక్ష్మి, ఎంఈఓ–1 గంగప్ప, ఎంఈఓ–2 ప్రకాష్, ఎంజీఎం హైస్కూల్ హెచ్ఎం రంగనాయకులు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జాతీయ విద్యా విధానంలో వచ్చిన మార్పులకు అనుగుణంగా అంగన్‌వాడీ పిల్లలకు పునాది విద్యను అందించే విధానాలపై కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. పిల్లల అభ్యసన సామర్థ్యాన్ని పెంపొందించేలా విద్యా బోధన పద్ధతులపై అవగాహన కల్పించ నున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 11, 12, 13, 22, 24, 25 తేదీల్లో మొత్తం ఆరు రోజుల పాటు శిక్షణ కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌పీలు రాజు, రాము, నరసింహారెడ్డి, సూపర్ వైజర్లు శాంతి, అనిత, సరస్వతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ముగ్గురు విద్యార్థుల ఎంపిక



**పెనుకొండ/పరిగి, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, ఆగస్టు11:**

పరిగి మండలం మోద గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్)కు ఎంపికయ్యారు. విద్యార్థులు సాహిల్, మధుప్రియ, చేతన ప్రతిభ కనబరిచి స్కాలర్‌షిప్‌కు అర్హత సాధించారు. విద్యార్థుల విజయంపై పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులకు సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు రాజశేఖర్, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు రామారెడ్డి ప్రత్యేక శిక్షణ అందించారు. విద్యార్థులను పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ సునందమ్మ, విశ్రాంత ఉపాధ్యాయులు గురురాజరావు, గ్రామస్తులు, తల్లిదండ్రులు అభినందించారు.

## కూటమి ప్రభుత్వంలో ప్రజారోగ్యానికి పెద్దపీట



**పలమనేరు, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, ఆగస్టు11:**

కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ వైద్య రంగం లో మౌలిక వసతులను బలోపేతం చేయడంతో పాటు మెరుగైన వైద్య సేవలను ప్రజలకు చేరువ చేస్తోందని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అన్నారు. మంగళవారం పలమనేరు ఏరియా ఆసుపత్రిలో తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని వాహనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గర్భిణీలు, బాలింతలు, శిశువులకు అవసరమైన సమయంలో రవాణా సదుపాయం కల్పించేందుకు తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. పలమనేరు నియోజకవర్గానికి ఇప్పటికే మూడు వాహనాలు అందుబాటులోకి వచ్చాయని, అవసరాలకు అనుగుణంగా భవిష్యత్‌లో మరిన్ని వాహనాలు తీసుకురావడానికి కృషి చేస్తామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సైతం నాణ్యమైన వైద్యం అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వసతులు, ఆధునిక వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యమని పేర్కొన్నారు. అనంతరం ఆసుపత్రి వైద్యులు, అధికారులతో వైద్య సేవలు, ఆసుపత్రిలోని వసతులపై ఎమ్మెల్యే చర్చించారు. కార్యక్రమంలో వేర్‌హౌస్ కమిటీ డైరెక్టర్ రంగనాథ్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజన్న, బాలాజీ కో–ఆపరేటివ్ సూపర్ బజార్ అధ్యక్షుడు ఆర్వీ బాలాజీ, ఆసుపత్రి సూపరింటెండెంట్ మమతారాణి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్లు నాగరాజు, సుధాకర్, వి.కోట ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ ధీరజ్, నాయకులు రాంబాబు, కుట్టి, గిరిబాబు, కృష్ణమూర్తి గౌడ్, శ్రీధర్, మదన్ తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు ఎక్స్‌ప్రెస్
జాతీయ తెలుగు దినపత్రిక
APTEL/2024/86143



# మొరాయించిన పాస్‌పోర్టు సర్వర్లు



-మొదటిపేజీ తరువాయి

పడింది. విజయవాడ, తిరుపతి, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లోని పాస్‌పోర్టు కార్యాలయాల్లో సర్వర్లు పని చేయకపోవడంతో సేవల కోసం వచ్చిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విజయవాడ పాస్‌పోర్ట్ సేవా కేంద్రం వద్ద ఉదయం నుంచే దరఖాస్తుదారులు బారులు తీరారు. సర్వర్లు ఎప్పుడు తిరిగి పని చేస్తాయో తెలియక గంటల తరబడి కార్యాలయం వద్దే పడిగాపులు కాస్తున్నారు. కొత్త పాస్‌పోర్టు కోసం దరఖాస్తు చేసుకున్నవారు, పునరుద్ధరణ (రెన్యువల్) కోసం వచ్చిన వారు, పాస్‌పోర్టు పాడైపోయి కొత్తవాటికి స్లాట్లు బుక్ చేసుకున్న వారు పెద్ద ఎత్తున కార్యాలయానికి చేరుకున్నారు. అపాయింట్‌మెంట్ తీసుకున్న వారిలో విద్యార్థుల సంఖ్యే అధికంగా ఉంది. సర్వర్ స్లో కావడంతో దరఖాస్తుల ప్రక్రియ ఏమాత్రం ముందుకు సాగడం లేదని అభ్యర్థులు చెబుతున్నారు.

**ముందస్తు సమాచారం కరవు**

సాంకేతిక సమస్యపై అధికారులు తమకు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వలేదని దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు కేటాయించిన స్లాట్ ప్రకారం సమయానికి కార్యాలయానికి వస్తే, కనీసం లోపలికి కూడా అనుమతించడం లేదని మండిపడుతున్నారు. సర్వర్లు మొరాయించిన విషయాన్ని కనీసం ఫోన్‌కు మెసేజ్ రూపంలో కూడా తెలపలేదని వాపోతున్నారు. కార్యాలయం వద్ద గంటల తరబడి వేచి చూద్దామంటే, కనీసం కూర్చోవడానికి కుర్చీలు, తాగడానికి మంచినీళ్లు కూడా లేక అవస్థలు పడుతున్నట్లు వివరించారు.

**దూర ప్రాంతాల నుంచి**

విజయవాడ పాస్‌పోర్టు కార్యాలయానికి కేవలం స్థానికులే కాకుండా రాష్ట్రంలోని పలు మూలల నుంచి ప్రజలు వచ్చారు. రాయలసీమ, ఉమ్మడి గోదావరి జిల్లాలు, నెల్లూరు, ప్రకాశం, కృష్ణా, గుంటూరులతో పాటు హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి కూడా దరఖాస్తుదారులు ఇక్కడికి తరలివచ్చారు. ఒక్కొక్కరికి ఒక్కో స్లాట్ సమయం కేటాయించడంతో లోపలికి అనుమతించకపోవడంతో తమ సమయం దాటిపోతుందేమోనని వారు ఆందోళన చెందారు. సర్వర్ సమస్యను వెంటనే పరిష్కరించాలని అధికారులను కోరారు. ఇంత దూరం నుంచి వ్యయప్రయాసలకోర్చి వస్తే నిరాశే మిగిలిందని ఆవేదన వ్యక్తం చేశారు.

**అపాయింట్‌మెంట్స్ రీషెడ్యూల్**

సర్వర్ల సమస్య ఇప్పట్లో పరిష్కారం అయ్యేలా కనిపించకపోవడంతో అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇవాళ్టి అపాయింట్‌మెంట్లను మరో రోజుకు రీషెడ్యూల్ చేసినట్లు దరఖాస్తుదారులకు అధికారికంగా తెలిపారు. సర్వర్ సమస్య కారణంగా ఇవాళ సేవలు అందించలేకపోతున్నామని వివరించారు. దరఖాస్తుదారులందరికీ ఈ నెల 17వ తేదీన మొబైల్‌కు ఒక మెసేజ్ వస్తుందని స్పష్టం చేశారు. ఆ మెసేజ్‌లో సూచించిన కొత్త తేదీల్లోనే కార్యాలయానికి రావాలని సూచించారు. దీంతో చేసేదేమీ లేక ప్రజలు నిరాశగా ఇళ్లకు వెనుతిరుగుతున్నారు.

"మేము పాస్‌పోర్టు పని మీద చాలా దూరం నుంచి ఇక్కడికి వచ్చాం. మాకు కేటాయించిన స్లాట్ సమయానికే చేరుకున్నాం. కానీ తీరా వచ్చాక సర్వర్లు పనిచేయడం లేదని చెబుతున్నారు. ఈ విషయం మాకు ముందుగా ఒక మెసేజ్ ద్వారా చెప్పి ఉంటే ఇంత దూరం వచ్చి ఇబ్బంది పడేవాళ్లం కాదు. ఇక్కడ కనీసం కూర్చోవడానికి సరైన వసతి లేదు, తాగడానికి నీళ్లు లేవు. మళ్లీ 17వ తేదీన మెసేజ్ వస్తుందని, అప్పుడు కొత్త తేదీ ఇస్తామని చెబుతున్నారు. దీనివల్ల మాకు సమయం, డబ్బు వృథా అవుతున్నాయి." –దరఖాస్తుదారులు

# విద్యతోనే ఎరికుల భవిష్యత్తుకు బంగారు బాట

## పిల్లల చదువుకు తల్లిదండ్రులు ప్రాధాన్యత ఇవ్వాలి: ఎస్టీ కమిషన్ సభ్యుడు వెంకటప్ప







**కుప్పం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, ఆగస్టు11:**

ఎరికుల భావితరాల అభ్యున్నతికి విద్యే ప్రధాన మార్గమని ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కమిషన్ సభ్యుడు వెంకటప్ప అన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా తల్లిదండ్రులు పిల్లల చదువును మధ్యలో నిలిపివేయకుండా ఉన్నత విద్య అందించాలని సూచించారు. మంగళవారం కుప్పం పట్టణంలో పర్యటించిన వెంకటప్పకు ఆల్ ఇండియా ఏకలవ్య ఎరుకుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జగన్ ఆధ్వర్యంలో సంఘ సభ్యులు ఘన స్వాగతం పలికారు. అనంతరం వాణి మహల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వెంకటప్ప మాట్లాడారు. కూటమి ప్రభుత్వం వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. విద్య ద్వారానే ఉపాధి అవకాశాలు, సామాజిక అభివృద్ధి సాధ్యమవుతాయని పేర్కొన్నారు. ఎరికుల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పీకేఎం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ డాక్టర్ బీఆర్ సురేష్‌బాబు మాట్లాడుతూ ప్రకృతితో మమేకమై జీవించే ఎరికుల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన కుటుంబాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కడా ఏపీడీ శ్రీనివాసరాజు, రూరల్ సీఐ మల్లేష్ యాదవ్, పట్టణ ఎస్ఐ బాబు, సంఘ నాయకులు, అధికారులు, స్థానిక నాయకులు, ఎరికుల సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# రాజకీయ విభేదాలు వ్యక్తిగత విమర్శలకు దారితీయొద్దు





**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఆగస్టు11:**

వైసీపీ అధిష్ఠానం పిలుపు మేరకు కుప్పం పట్టణంలో సోమవారం నిర్వహించేందుకు ప్రయత్నించిన ర్యాలీని పోలీసులు అడ్డుకోవడం దారుణమని ఎమ్మెల్సీ భరత్ అన్నారు. చిత్తూరు జిల్లా కుప్పం పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మెగా డీఎస్సీ నియామకాల్లో అవకతవకలు జరిగాయంటూ వైసీపీ చేస్తున్న విమర్శలకు సమాధానం చెప్పలేక అధికార కూటమి ప్రభుత్వం తమ పార్టీ చేపడుతున్న ఉద్యమాలను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తోందని భరత్ ఆరోపించారు. ఇందులో భాగంగానే సోమవారం కుప్పంలో వైసీపీ ర్యాలీ నిర్వహించకుండా పోలీసులు అడ్డుకున్నారని పేర్కొన్నారు. ర్యాలీని అడ్డుకునే క్రమంలో టీడీపీ, బీజేపీకి చెందిన కొందరు నాయకులు హద్దులు మీరి తన తల్లిని అవమానించేలా మాట్లాడటం బాధాకరమని భరత్ అన్నారు. రాజకీయాల్లో విభేదాలు సహజమేనని, అయితే వ్యక్తిగతంగా కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకుని అవమానకరంగా మాట్లాడటం సరైన పద్ధతి కాదని పేర్కొన్నారు. కుప్పం నియోజకవర్గంలో ఇప్పటివరకు ఇలాంటి రాజకీయ సంస్కృతిని చూడలేదని ఆయన అన్నారు. తన తల్లిని అవమానించేలా మాట్లాడిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరినట్లు తెలిపారు. ఈ ఘటనను రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ తీవ్రంగా ఖండించాలని పిలుపునిచ్చారు. రాజకీయ విమర్శలు విధానాలు, ప్రజా సమస్యలపై ఉండాలే తప్ప వ్యక్తిగత కుటుంబ సభ్యులను కించపరిచే స్థాయికి వెళ్లకూడదని భరత్ పేర్కొన్నారు. తన తల్లిని అవమానకరంగా మాట్లాడిన వ్యక్తులను గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# నిందితులకే మద్దతా...

## నిన్న అప్పలరాజు... ఇవాళ పాస్టర్ కోడుకు

**రాజమండ్రి :** రాజమండ్రిలో డాక్టర్ ప్రియాంకపై కారు ఎక్కించి దారుణంగా హత్య చేసిన ఉదంతం రాజకీయంగా, సామాజికంగా తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ కేసులో ప్రధాన నిందితుల్లో ఒకరైన ఆండ్రూ జోసెఫ్ ఎడ్వర్డ్స్ ప్రసిద్ధ పాస్టర్ కుమారుడు కావడంతో, ఈ వ్యవహారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకత్వానికి, ముఖ్యంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి తీవ్రమైన సంకట పరిస్థితిని తెచ్చిపెట్టింది. ఒకవైపు నిందితుడు తమకు అత్యంత కీలకమైన ఓటు బ్యాంక్ వర్గానికి చెందిన కుటుంబ నేపథ్యం కలవాడు కావడం, మరొకవైపు అత్యంత కిరాతకానికి గురైన బాధితురాలు వైద్య విద్యార్థిని కావడం వల్ల.. ఈ కేసులో ఎటువైపు నిలబడాలో తెలియక వైసీపీ రాజకీయ డైలమాలో పడింది. ఈ విమర్శలు రావడంతో చివరికి జగన్ ప్రభుత్వాన్ని నిందిస్తూ ఓ ట్వీట్ చేసి పడేశారు.ఇటీవల కాశిబుగ్గ సమీపంలో మాజీ మంత్రి, వైసీపీ నేత సీదిరి అప్పలరాజు కుమారుడు ఆరవ్ వర్మ జరిపిన హిట్ అండ్ రన్ కేసులో ఒక పేద గొర్రెల కాపరి దానయ్య ప్రాణాలు కోల్పోతే, వైసీపీ అనుసరించిన వైఖరి పైనే ఇప్పుడు ప్రధాన చర్చ జరుగుతోంది. ఆ కేసులో సొంత పార్టీ నేత కుమారుడిని రక్షించేందుకు వేరొక అనామకుడిపై నింద మోపే ప్రయత్నం చేశారు. దానయ్యను కాపాడే ప్రయత్నం చేయలేదు. దానయ్య కుటుంబాన్ని ఆదుకోలేదు. తప్పుడు కుట్రలు చేసినందుకు సీదిరి అప్పలరాజుపై కేసు నమోదు చేస్తే దాన్ని రాజకీయ కక్ష సాధింపు గా జగన్ రెడ్డి వర్గీకరించడం తీవ్ర విమర్శలకు దారితీసింది. బాధితుడైన గొర్రెల కాపరి కుటుంబం ఆవేదనను పక్కనపెట్టి, కేవలం తమ పార్టీ నేత, కుల సమీకరణాలకే జగన్ ప్రాధాన్యత ఇచ్చారు. మత్స్యకార నాయకుడ్ని వేధిస్తున్నట్లుగా ప్రచారం చేశారు.ఇదే ప్రాతిపదికన విశ్లేషిస్తే, ఇప్పుడు రాజమండ్రి కేసులో కూడా వైసీపీ అదే తరహా సొంత వర్గ రక్షణ వ్యూహాన్ని అమలు చేస్తుందా అనే ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. జోసెఫ్ ఎడ్వర్డ్స్ కుటుంబం సామాజికంగా, మతపరంగా వైసీపీకి సాంప్రదాయకంగా మద్దతు ఇచ్చే వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తోంది. ఇప్పుడు గనుక రాజమండ్రి కేసులో నిందితులకు కఠిన శిక్ష పడాలని, వారిపై ఉద్దేశపూర్వక హత్య సెక్షన్లు సమర్థనీయమేనని వైసీపీ డిమాండ్ చేస్తోంది పైపైకే. ఎందుకంటే ప్రజాగ్రహం ఎక్కువగా ఉంది కాబట్టి ఇలా ప్రియాంక కోసం మాట్లాడుతున్నారు. మరి కాశిబుగ్గ కేసులో అప్పలరాజు కొడుకుపై చట్టం చర్యలు తీసుకున్నప్పుడు ఎందుకు వ్యతిరేకించారు? అక్కడ లేని న్యాయసూత్రాలు ఇక్కడ మాత్రమే గుర్తుకొచ్చాయా?

## ప్రతికూల పరిస్థితుల్లోనూ 10.7 శాతం సానుకూల ఆర్థిక వృద్ధిరేటు

-మొదటిపేజీ తరువాయి

శాఖలోనూ అత్యాధునిక టెక్నాలజీని అనుసంధానించి నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. కృష్ణా నదిలో ప్రవాహాలు లేకపోవడంతో గోదావరి వరద నీటిని మళ్లించి కృష్ణా డెల్టాను ఆదుకున్నామన్నారు. భూగర్భ జలాలు తగ్గుతున్న తరుణంలో నీటి లభ్యత, ఉత్పత్తుల విలువ జోడింపుపై ప్రత్యేక కంటింజెన్సీ ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ప్రజలపై నిత్యావసర ధరల భారం పడకుండా నిరంతరం పర్యవేక్షించేందుకు ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అంతర్జాతీయ మార్కెట్లకు అయ్యే ఎగుమతులపై ఎలాంటి ప్రభావం పడకుండా జాగ్రత్త వహించాలన్నారు. లక్ష్య సాధన తెలికయ్యేలా జిల్లా, నియోజకవర్గం, మండల వారీగా నివేదికలు తయారు చేయాలని నిర్దేశించారు. ఆర్థిక క్రమశిక్షణను పాటిస్తూనే అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రజలకు సమర్థవంతంగా అందించేలా ప్రతి ప్రణాళిక రూపుదిద్దుకోవాలని సీఎం దిశానిర్దేశం చేశారు. గడచిన రెండేళ్లుగా జాతీయ సగటు కంటే మెరుగైన రీతిలో ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ స్థిరమైన ప్రగతిని కనబరుస్తోందని ప్రణాళికా విభాగం నివేదిక వెల్లడించింది. ముఖ్యంగా 2025–26 ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో వ్యవసాయ రంగం 13.5 శాతం, పారిశ్రామిక రంగం 10.6 శాతం, సేవా రంగం 9.9 శాతం వృద్ధిని నమోదు చేసి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా నిలిచినట్లు నివేదికలో పేర్కొన్నారు.

పశుసంవర్ధక శాఖ పరిధిలో మాంసం ఉత్పత్తి 9.6 శాతం, గుడ్ల ఉత్పత్తి 5.1 శాతం మేర గణనీయంగా పెరిగాయి. సేవా రంగాన్ని పరిశీలిస్తే సమాచార సాంకేతికత, రవాణా, వాణిజ్య కార్యకలాపాలు ఎంతో వేగంగా విస్తరిస్తున్నాయి. వాణిజ్య వాహనాల నమోదు ఏకంగా 51.6 శాతం పెరగడం రాష్ట్రంలో పుంజుకున్న ఆర్థిక లావాదేవీలకు నిదర్శనంగా నిలుస్తోంది. నిరంతరం ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించడం వల్లనే ఈ స్థాయి ఫలితాలు సాధ్యమయ్యాయని సీఎం అన్నారు.

జీఎస్టీ పన్ను వసూళ్లు 21 శాతం: ప్రభుత్వ టెక్నాలజీ ఇంటిగ్రేషన్ కారణంగా జీఎస్టీ పన్ను వసూళ్లు 21 శాతం వృద్ధితో 13 వేల 282 కోట్లకు చేరుకున్నాయి. సాధారణ ఎగుమతుల్లో 16 వేల 322 కోట్లతో 10.5 శాతం వృద్ధి నమోదైంది. ఙ్యూ× ద్వారా సాగిన ఎగుమతులు 32.2 శాతం మేర భారీగా పెరిగాయి. రాష్ట్రంలో 2.88 లక్షల కోట్ల విలువైన మెగా ప్రాజెక్టుల పెట్టుబడులు గ్రౌండింగ్ కావడంతో పాటు ఎంఎస్?ఎంఈ రంగంలో 60 వేల కోట్ల మేర పెట్టుబడులు వచ్చి చేరాయి. పన్ను, పన్నేతర ఆదాయాలు గణనీయంగా పెరిగాయి.

## 158 గ్రామాలకు తొలిసారి రహదారి సౌకర్యం

-మొదటిపేజీ తరువాయి

చేపట్టనున్నారు. 13 జిల్లాల్లో రహదారి సౌకర్యం లేని ఆవాసాలను గుర్తించి, అంచనాలు రూపొందించామన్నారు. ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన పథకం కింద రూ.422.10 కోట్ల నిధులు వచ్చాయని తెలిపారు. రోడ్ల నిర్వహణకు మరో రూ.24.47 కోట్లు విడుదలయ్యాయి. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం ఈ రోడ్ల నిర్మాణం చేపట్టనుంది. మారుమూల గ్రామాలకు నిర్మించే రహదారుల నాణ్యత విషయంలో అత్యున్నత ప్రమాణాలు పాటించాలని అధికారులను పవన్ కల్యాణ్? ఆదేశించారు. రోడ్లు, వంతెనల నిర్మాణంతో ఆయా గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు ఏర్పడి, ప్రజలకు మెరుగైన విద్య, వైద్యం, మార్కెటింగ్ సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని ఆయన తెలిపారు.

**ఏపీకి రెండో ర్యాంకు**

మరోవైపు ఇటీవలే గ్రామీణ రహదారుల నిర్మాణంలో ఏపీ జాతీయ స్థాయిలో సత్తా చాటింది. కేంద్రం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన' పనుల్లో గుజరాత్ మొదటి ర్యాంకును కైవసం చేసుకోగా, ఆంధ్రప్రదేశ్? రెండో ర్యాంకు దక్కించుకుంది. రహదారుల నాణ్యత విషయంలో రాష్ట్రం అత్యుత్తమ ప్రమాణాలు పాటిస్తోందని కేంద్ర ప్రభుత్వం ప్రశంసల వర్షం కురిపించింది. వైఎస్సార్సీపీ పాలనలో 19వ స్థానంలో ఉన్న ఏపీ ఇప్పుడు ఏకంగా రెండో స్థానానికి ఎగబాకడం విశేషం.

ఇందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీసుకున్న ప్రత్యేక చర్యలే కారణం. గ్రామీణ రహదారుల అభివృద్ధిపై ఆయన మొదటి నుంచి ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. గ్రామాల్లో ఎక్కడ రోడ్డు కావాలని ప్రజలు కోరినా, కేవలం గంటల వ్యవధిలోనే ఆ పనులను ఆయన మంజూరు చేస్తున్నారు. రోడ్ల నిర్మాణ పనుల పురోగతిపై నిరంతరం సమీక్షలు నిర్వహిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పనుల నాణ్యతను పర్యవేక్షించేందుకు సమర్థులైన అధికారులను నియమించారు.

అంతేకాక పవన్ కల్యాణ్ స్వయంగా రంగంలోకి దిగి నిర్మిస్తున్న రోడ్ల నాణ్యతను క్షేత్రస్థాయికి వెళ్లి నిశితంగా పరిశీలించారు. ఈ క్రమంలోనే కాంట్రాక్టర్లు, అధికారులకు దిశానిర్దేశం చేశారు. పవన్ కల్యాణ్ కఠిన వైఖరితో రహదారుల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పెరిగాయి. రాజీ లేని నాణ్యతతో పల్లె ప్రజలకు మంచి రహదారులు అందుబాటులోకి వచ్చాయి.

## సీడ్ యాక్సెస్ రోడ్డు పనులకు గ్రీన్ సిగ్నల్

-మొదటిపేజీ తరువాయి

జారీ చేసింది. అయితే ఈ భూసేకరణ విషయంలో అధికారులు చట్ట నిబంధనలను ఏమాత్రం అనుసరించలేదని ఆరోపిస్తూ పలువురు రైతులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వం ఇచ్చిన భూసేకరణ నోటిఫికేషన్‌ను, దానికి అనుగుణంగా ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ను పూర్తిగా రద్దు చేయాలని కోరారు. ఈ మేరకు హైకోర్టు సింగిల్ జడ్జి వద్ద పలు వ్యాజ్యాలు దాఖలు చేశారు.

**ప్రభుత్వ వాదనలు ఇవే**

రైతుల పిటిషన్లపై హైకోర్టులో విచారణ జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపించారు. సీడ్ యాక్సెస్ రోడ్డు భూసేకరణ ప్రక్రియ పారదర్శకంగా సాగుతోందని కోర్టుకు వివరించారు. ఎక్కడా చట్ట ఉల్లంఘనలు జరగలేదని స్పష్టం చేశారు. పక్కాగా చట్ట నిబంధనల ప్రకారమే భూసేకరణ చేపడుతున్నామని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. రైతులు చేసిన ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు.

**విస్తృత ప్రయోజనాల దృష్ట్యా**

రైతులు, ప్రభుత్వం తరఫున వాదనలు విన్న ఉన్నత న్యాయస్థానం ఇటీవల ఈ వ్యవహారంపై తీర్పును రిజర్వ్ చేసింది. తాజాగా రైతులు వేసిన పిటిషన్లను కొట్టివేస్తూ తుది ఉత్తర్వులు జారీ చేసింది. సీడ్ యాక్సెస్ రోడ్డు అనేది రాజధాని నిర్మాణంలో భాగమని, ఇది విస్తృత ప్రజానీకం ప్రయోజనాలతో ముడిపడి ఉందని కోర్టు అభిప్రాయపడింది. ఇలాంటి విస్తృత ప్రయోజనాల దృష్ట్యా జరుగుతున్న ప్రక్రియను తాము అడ్డుకోలేమని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ తీర్పుతో సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణానికి అడ్డంకులు పూర్తిగా తొలగిపోయినట్లయింది.

## డీఎస్సీపై ఒంటరి పోరు

**గుంటూరు :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ డీఎస్సీ 2025 పై ఉద్యమం చేపడుతోంది. అయితే ఈ ఉద్యమం విషయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏం ఆశిస్తుందో తెలియడం లేదు కానీ.. ప్రజల్లోకి ఈ అంశం వెళ్లడం లేదు. పైగా కొన్ని వర్గాలు వ్యతిరేకిస్తున్నాయి. సమాజంలో అస్థిరతను, గందరగోళాన్ని సృష్టించేందుకే డీఎస్సీ పై విష ప్రచారం చేస్తున్నారు అంటూ కొంతమంది మండిపడుతున్నారు. కూటమి ప్రభుత్వాన్ని వ్యతిరేకించే న్యాయవాది జడ శ్రావణ్ కుమార్ సైతం ఈ విషయంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తీరును తప్పుపట్టారు. ఇప్పుడు జాతీయ పార్టీ కాంగ్రెస్ సైతం దీనిని తీవ్రంగా తప్పుపడుతోంది. వేలాదిమంది ఉపాధ్యాయుల్లో అశాంతి నింపడమే అవుతుందని తేల్చి చెబుతోంది. ప్రజా సమస్యలు గాలికి వదిలి డీఎస్సీ 2025 పై విషం చిమ్మడంపై తీవ్రస్థాయిలో ఆక్షేపిస్తోంది. కేంద్ర మాజీమంత్రి చింతామోహన్ మీడియా సమావేశం ఏర్పాటు చేసి మరి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీతోపాటు జగన్మోహన్ రెడ్డి తీరుపై మండిపడ్డారు. ఇంత జరిగాక కూడా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వెనక్కి తగ్గకపోవడం ఆందోళన కలిగిస్తోంది.సమకాలీన అంశాలపై ఎప్పటికప్పుడు స్పందిస్తుంటారు కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్. తాజాగా రాష్ట్ర వ్యాప్తంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ డీఎస్సీ పై ఆందోళనలు చేస్తున్న సంగతి తెలిసిందే. అదే సమయంలో వేలాది మంది ఉపాధ్యాయులు కర్నూలు కొండారెడ్డి బురుజు సెంటర్ పై ఆత్మగౌరవం పేరుతో నిరసన చేపట్టారు. ఈ క్రమంలో రాయలసీమ వాసిగా.. బాధ్యతాయుతమైన కేంద్ర మాజీ మంత్రిగా స్పందించారు చింతా మోహన్. అసలు డీఎస్సీ పై ఉద్యమం ఎందుకు చేయాల్సి వచ్చిందని ప్రశ్నించారు.

# కొండవీడు ఎక్స్‌ప్రెస్‌ను ప్రతిరోజూ నడపాలి



**హిందూపురం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, ఆగస్టు11:**
కొండవీడు ఎక్స్‌ప్రెస్ రైలును వారానికి మూడు రోజులకు పరిమితం చేయకుండా ప్రతిరోజూ నడపాలని హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి కోరారు. ఢిల్లీలోని రైల్వే భవన్‌లో కేంద్ర రైల్వే సహాయ మంత్రి సోమన్నను మంగళవారం కలిసి వివిధ నూతన రైలు సర్వీసులు, స్టాపింగులపై వినతిపత్రం అందించారు. కుర్లా ఎక్స్‌ప్రెస్‌కు పెనుకొండ రైల్వే స్టేషన్‌లో స్టాపింగ్ కల్పించాలని, బసవ ఎక్స్‌ప్రెస్‌కు పెనుకొండలో రెగ్యులర్ స్టాపింగ్ ఇవ్వాలని ఎంపీ కోరారు. దీనివల్ల ఉత్తర కర్ణాటక ప్రాంతాలకు ప్రయాణించే ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని వివరించారు. కొండవీడు ఎక్స్‌ప్రెస్‌ను ప్రతిరోజూ నడపాల్సిన అవసరాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎంపీ తెలిపారు. కార్యక్రమంలో అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, రాయదుర్గం ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు, కేంద్ర రైల్వే అధికారులు పాల్గొన్నారు.

# మహాలక్ష్మి దీప పూజ ఏర్పాట్లపై ఎమ్మెల్యే సమీక్ష

## భక్తులకు ఇబ్బందులు లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి



**పలమనేరు, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, ఆగస్టు11:**
చిత్తూరు జిల్లాపలమనేరు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఈ నెల 14న నిర్వహించనున్న శ్రీ మహాలక్ష్మి దీప పూజ కార్యక్రమ ఏర్పాట్లపై ఎమ్మెల్యే అమరనాథరెడ్డి మంగళవారం అధికారులు, నాయకులతో సమీక్ష నిర్వహించారు. సుమారు 2 వేల మంది భక్తులు హాజరుకానున్న నేపథ్యంలో ఎలాంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, భద్రత వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. టిటిడి ఆధ్వర్యంలో జారీ చేసిన పాసులు ఉన్న భక్తులకు మాత్రమే పూజలో పాల్గొనేందుకు అనుమతి ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. భక్తుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. మున్సిపల్ అధికారులు పారిశుద్ధ్య చర్యలు చేపట్టి అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని, అగ్నిప్రమాదాల నివారణకు అగ్నిమాపక శాఖ ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని కోరారు. సమీక్షలో డీఎస్పీ దేగల ప్రభాకర్, సీఐలు మోహన్‌రెడ్డి, పరశురాముడు, మున్సిపల్ కమిషనర్ లోకేష్‌వర్మ, ట్రాన్స్‌కో ఏఈ జీవన్‌కుమార్‌రెడ్డి, ఫైర్‌మెన్ యూనుస్, హెడ్ కానిస్టేబుల్ రెడ్డెప్పరెడ్డి, సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

# కడా అభివృద్ధి పనులను పరిశీలించిన ప్రత్యేక అధికారి



**శాంతిపురం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, ఆగస్టు11:**
కడ ప్రత్యేక అధికారి వికాస్ మర్మత్ మంగళవారం రాళ్లబూదుగూరులో పర్యటించి పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. రాళ్లబూదుగూరు సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థినులకు అందుతున్న భోజనం, వసతి, ఇతర సౌకర్యాలపై ఆరా తీశారు. లోపాలను వెంటనే సరిచేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన పార్కును పరిశీలించి, దాని నిర్వహణపై వివరాలు తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ ప్రభుత్వ పథకాలు సక్రమంగా అమలయ్యేలా చూడాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఎన్.ఉదయ్‌కుమార్, యూనిట్ ఇన్‌చార్జ్ ఆర్ఎస్.మణి, క్లస్టర్ ఇన్‌చార్జిలు రాజేంద్ర, నాగరాజు, రెస్కో డైరెక్టర్ బసవరాజు, నాయకులు మంజునాథ్, జెనీ, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆలయ నిర్మాణానికి భూమిపూజ



**శాంతిపురం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, ఆగస్టు 11:**
రాళ్లబూదుగూరుగ్రామంలో శ్రీ నల్లగంగమ్మ, తిరుపతి గంగమ్మ ఆలయ నిర్మాణానికి మంగళవారం శాంతి పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్మాణానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శ్రీ వాణి ట్రస్ట్ ద్వారా రూ.25 లక్షలు మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఆలయ నిర్మాణం ఎలాంటి ఆటంకాలు లేకుండా సకాలంలో పూర్తికావాలని, గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, సమృద్ధిగా వర్షాలు కురవాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పొంగళ్లు, దీపారాధన, అన్నదానం నిర్వహించి అమ్మవారి ఉత్సవ విగ్రహాలను గ్రామంలో వైభవంగా ఊరేగించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, కడా ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్, ఆలయ కమిటీ చైర్మన్ బి.ఎం. కుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు ఎన్.ఉదయ్‌కుమార్, నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# రేణిగుంట సబ్ డివిజన్‌లో సెక్షన్ 30 అమలు

## అనుమతి లేకుండా సభలు, ర్యాలీలు, ధర్నాలకు నో..

## ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: డీఎస్పీ వై. శ్రీనివాసరావు



**రేణిగుంట, చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఆగస్టు 11 :**
శాంతిభద్రతల పరిరక్షణ, ఎలాంటి అవాం ఛనీయ సంఘటనలు చోటుచేసుకో కుండా ముందస్తు చర్యల్లో భాగంగా రేణిగుంట సబ్ డివిజన్ పరిధిలో సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ నిషేధాజ్ఞలు అమలు చేస్తున్నట్లు డీఎస్పీ వై. శ్రీనివాసరావు తెలిపారు. తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్ ఆదేశాల మేరకు ఆగస్టు 1 నుంచి 31వ తేదీ వరకు ఈ నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయని పేర్కొన్నారు. పోలీసుల ముందస్తు అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలు, రాస్తా రోకోలు, ఇతర గుంపుకార్యక్రమాలు నిర్వహించరాదని డీఎస్పీ స్పష్టంచేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్ట పరమైన చర్యలు తప్పవని హెచ్చరించా రు. ఈ నిషేధాజ్ఞలు రేణిగుంట సబ్ డివిజన్ పరిధిలోని రేణిగుంట, గాజుల మండ్యం,ఏర్పేడు,రైల్వే కోడూరు, ఓబుల వారిపల్లె, చిట్వేల్, పుల్లంపేట, పెనగలూరు పోలీస్ స్టేషన్ల పరిధిలో అమలులో ఉంటాయని తెలిపారు. ప్రజల శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు తీసుకున్న చర్యలకు ప్రజలు సహకరించాలని డీఎస్పీ శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు.

# డీఎస్పీపై వైసీపీ డ్రామాలు.

## . జనసేన నాయకుడు మిథున్ శాలి ఫైర్



**రేణిగుంట, చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఆగస్టు11:**
రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ నాయకులు నిర్వహిస్తున్న ధర్నాలపై జనసేన శ్రీకాళహస్తి నియోజకవర్గ నాయకుడు మిథున్ శాలి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రేణిగుంటలో మంగళవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ.. డీఎస్సీ అంశాన్ని రాజకీయంగా వాడుకుంటూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం వైసీపీ నాయకులు చేస్తున్నారని ఆరోపించారు. డీఎస్సీ విషయంలో ప్రభుత్వం ఇప్పటికే స్పష్టమైన చర్యలు చేపడుతున్నప్పటికీ, వైసీపీ నాయకులు రాజకీయ లబ్ధి కోసం ధర్నాలు,ఆందోళనలు చేస్తున్నారని మిథున్ శాలి విమర్శించారు.గత ప్రభుత్వ హయాంలో నిరుద్యోగులు, విద్యార్థుల సమస్యలను పట్టించుకోకుండా ఇప్పుడు ఆందోళనలకు దిగడం విడ్డూరంగా ఉందన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని,డీఎస్సీ నియామక ప్రక్రియపై అభ్యర్థులకు ఎలాంటి అనుమానాలు లేకుండా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. రాజకీయ ప్రయోజనాల కోసం విద్యార్థులు,నిరుద్యోగులను రెచ్చగొట్టే ప్రయత్నాలను మానుకోవాలని వైసీపీ నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం.. కూటమి ప్రభుత్వ ఘనత :

## క్లస్టర్ ఇన్-చార్జ్ డి.పుష్పనాధన్





**రేణిగుంట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు11:**
కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడం అభినందనీయమని క్లస్టర్ ఇన్‌చార్జ్ డి. పుష్పనాధన్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా మరింత సాధికారత సాధించేందుకు ఉచిత బస్సు ప్రయాణం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. రోజువారీ ప్రయాణాలు, ఉద్యోగాలు, విద్య,వైద్యం తదితర అవసరాల కోసం బస్సుల్లో ప్రయాణించే మహిళలకు ఈ పథకం ఆర్థిక భారాన్ని తగ్గిస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని డి. పుష్పనాధన్ పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ద్వారా కుటుంబాలపై ప్రయాణ ఖర్చుల భారం తగ్గడంతో పాటు మహిళలకు స్వేచ్ఛగా ప్రయాణించే అవకాశం కలుగుతోందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి, అర్హులైన ప్రతి ఒక్కరికీ వాటి ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం కుటుంబ సభ్యులు సాగర్, నవాబ్, అంబి, మేరీ, జగదీష్, గౌస్, ఏలుమలై, దినేష్ సుధా, కన్నా రెడ్డి, రవి, సుమన్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

# పటిష్ట భద్రతా చర్యల నడుమ గణేష్ ఉత్సవాలు

## సీఐ జనార్ధన్, తహసీల్దార్ సౌజన్యలక్ష్మి

**హిందూపురం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, ఆగస్టు11:**



**రానున్న గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు** అన్ని శాఖల సమన్వయంతో పటిష్టమైన భద్రతా చర్యలు చేపడుతున్నట్లు హిందూపురం రూరల్ సీఐ కె.జనార్ధన్, లేపాక్షి తహసీల్దార్ జి.సౌజన్యలక్ష్మి తెలిపారు. జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ కేవీ మహేష్ పర్యవేక్షణలో ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. విగ్రహాల ప్రతిష్ఠాపనకు పందిళ్ల అనుమతులు, సీసీ కెమెరాల ఏర్పాటు, ట్రాఫిక్ నియంత్రణ, నిమజ్జన మార్గాలు, విద్యుత్ భద్రత తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు. ఉత్సవాల సమయంలో డ్రంక్ అండ్ డ్రైవ్, బహిరంగంగా మద్యం సేవించడంపై కఠిన చర్యలు తీసుకుంటా మని హెచ్చరించారు.ప్రజలు, ఉత్సవ నిర్వాహకులు నిబంధనలు పాటించి పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. అన్ని ముందస్తు చర్యలు తీసుకుని గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలు, సోదరభావంతో ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.

## ఇళ్లు, వాణిజ్య సంస్థలు, కార్యాలయాలపై

# జాతీయ పతాకం ఎగురవేయాలి



**హిందూపురం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, ఆగస్టు11:**
స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు ప్రతి ఇంటితో పాటు వాణిజ్యసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలపై జాతీయ పతాకాన్ని ఎగురవేయాలని మున్సిపల్ కమిషనర్ వి.మల్లికార్జున పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలమేరకు హిందూపురం పురపాలక సంఘం పరిధిలో ఈ నెల 10 నుంచి 15 వరకు నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమాలపై మంగళవారం మెప్మా సిబ్బందితో సమావేశం నిర్వహించారు. హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులు చురుకుగా పాల్గొనాలని, చెట్లను నాటే కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. 14, 15 తేదీల్లో త్రివర్ణ పతాక రంగులతో అలంకరణలు చేపట్టాలని తెలిపారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్, మెప్మా అధికారి ఎల్.గంగులయ్య, మెప్మా సీఓలు, డీఈఓ తదితరులు పాల్గొన్నారు.

# పెరుమాళ్లపల్లిలో నడివీధి గంగమ్మ వేడుకలు



**వెదురుకుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు11:**
పెరుమాళ్లపల్లిగ్రామంలో నడివీధి గంగమ్మ ఉత్సవాల్లో భాగంగా సల్ల పోసే కార్యక్రమం నిర్వ హించనున్నట్లు గ్రామ ప్రజలు తెలిపారు. ఇప్పటికే రెండు రోజులుగా కార్యక్రమం కొనసాగగా, బుధవారం ఉదయం 7గంటలకు సల్ల పోసే కార్యక్రమం నిర్వహించనున్నారు. అనం తరం సాయంత్రం 4గంటలకు ప్రతి ఇంటి నుంచి ఒక పొంగలి,చీర తీసుకురావాలని గ్రామ ప్రజల కు నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. గ్రామ ప్రజలంతా భక్తిశ్రద్ధలతో పాల్గొని నడివీధి గంగమ్మ అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు.

# ఇంటింటికీ 'రెండేళ్ల నమ్మకం-అభివృద్ధి-సంక్షేమం' ప్రచారం



**వెదురుకుప్పం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్,ఆగస్టు11:**
గంగాధర్ నెల్లూరు నియోజక వర్గం వెదురుకుప్పం మండలం వెదురుకుప్పం పంచాయతీలో 'రెండేళ్ల నమ్మకం--అభివృద్ధి-- సంక్షేమం' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వి.ఎం.థామస్ ఆదేశాల మేరకు, మండల అధ్యక్షుడు గురుసాల కిషన్‌చంద్ ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇనాము కొత్తూరు గ్రామ కమిటీ అధ్యక్షుడు పుల్లూరు సుధాకర్‌రెడ్డి, తంజావూరు నవీన్, బొగ్గల పవన్‌కుమార్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# కుప్పంలో పరిశ్రమలు, విద్యా-వైద్య వసతులపై ప్రత్యేక దృష్టి

## క్షేత్రస్థాయిలో అభివృద్ధి పనులను పరిశీలించిన

## కడా ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్





**కుప్పం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, ఆగస్టు11:**
చిత్తూరు జిల్లా కుప్పం ప్రాంతంలో పారిశ్రామిక అభివృద్ధితో పాటు విద్య, వైద్యం, విద్యార్థుల వసతి, మౌలిక సదుపాయాల అభివృద్ధికి సమాన ప్రాధాన్యత ఇస్తున్నట్లు కడా ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ తెలిపారు. మంగళవారం ఆయన పలు ప్రాంతాల్లో పర్యటించి అభివృద్ధి పనుల ం, ప్రభుత్వ సంస్థల్లోని వసతులను పరిశీ లించారు. మదర్ డెయిరీ పరిశ్రమను సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు. పరిశ్రమకు నీటి సౌకర్యం కల్పించేందుకు హంద్రీ-నీవా నీటిని వినియోగించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం రాళ్లబూదుగూరు ప్రభుత్వ మహిళా వసతి గృహం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి విద్యార్థులు, రోగులకు మెరుగైన వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. విజిలాపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను సందర్శించి భోజనం, వసతి, పరిశుభ్రతను పరిశీలించారు. భోజనశాలకు పెయింటింగ్, కొత్త స్టవ్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేశారు. పాఠశాల ప్రాంగణంలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయాలని సూచించారు. కడపల్లె డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రెసిడెన్షియల్ పాఠశాలలోనూ వసతులను పరిశీలించి విద్యార్థులకు సురక్షిత, పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని అధికారులకు సూచించారు. క్షేత్రస్థాయిలో గుర్తించిన సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని వికాస్ మర్మత్ తెలిపారు.

## దొరవారిసత్రం సంతలో ఆవుల రవాణాపై

# నాయుడుపేట డీఎస్పీ హెచ్చరిక

**నాయుడుపేట చిత్తూరు ఎక్స్‌ప్రెస్, ఆగస్టు11:**




మండలంలోని కుప్పారెడ్డిపాళెం సమీపంలో నిర్వహిస్తున్న సంతను నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు మంగళవారం తనిఖీ చేశారు. సంతలో ఆవుల రవాణా, నిల్వకు సంబంధించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.సంత ప్రాంగణంలో ఆవులను అక్రమంగా రవాణా చేయడం, నిల్వ ఉంచడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు. నిబంధనలను ఉల్లంఘించే వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.సంత నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఆవులను అక్రమంగా రవాణా చేయడానికి అనుమతించరాదని సూచించారు. సంతలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని డీఎస్పీ కోరారు.

Edited Printed Published & Owned by Dama VijayAKumar. And Printed at Vijay Publishers and Printers, #1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh.
Published at Vijay Publications, 1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. EDITOR DAMA VIJAYAKUMAR, RNI. NO. APTEL/2023/86143